# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం..

- ఓడినా బీఆర్ఎస్ ప్రజల పక్షమే..
- మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, చిత్రంలో జడ్పీ చైర్ పర్సన్ బిందు

బయ్యారం/గార్ల, డిసెంబర్ 7 : ప్రజా తీర్పును స్వాగతిస్తున్నమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదని తెలిపారు. అయినా ప్రజల తీర్పును స్వాగతిస్తామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. అదే స్ఫూర్తితో నేడు ప్రజల పక్షాన నిలబడతామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని రానున్న కాలంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చిన తర్వాత సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గంలో రూ.600 కోట్లు నిధులు పలు పనుల కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిందని వాటిని పూర్తి చేయాలని కోరారు. నియోజక వర్గంలోని కామేపల్లిలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని వాటిని మానుకొని, అభివృద్ధిలో పోటీ పడాలని సూచించారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాతా గణేశ్, సొసైటీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, సర్పంచ్ జగన్, నాయకులు లక్ష్మణ్ నాయక్, ఆర్వీ, ఐలయ్య, శ్రీను, వీరభద్రం, శ్రీనూ నాయక్, దేవోజీ , బావుసింగ్ గాజుల గణేశ్, బుడిగ మురళి, ఎం భాస్కర్‌రావు, ఉత్తరయ్య, నరసింహ, ఉమేశ్, మూడు సరిత, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

## మెరుగైన వైద్యం అందించాలి

### డీఎంహెచ్‌వో అంబరీష

గూడూరు, డిసెంబర్7: గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో అంబరీష అన్నారు. గురువారం మండలంలోని అయోధ్యపురం గ్రామంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని సూచించారు. అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. నిర్దేశించిన జాతీయ కార్యక్రమాలు చేపట్టాలని, ఆరోగ్య ఉప కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ యమున, హెచ్‌ఈవో లోక్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి

### మండల నోడల్ అధికారులు రాందాస్, మంగతాయి

నెల్లికుదురు, డిసెంబర్ 7 : కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకుని పాఠశాల స్థాయిలో అమలు పర్చి విద్యార్థుల నుంచి సత్ఫలితాలను పొందాలని మండల నోడల్ ఆఫీసర్లు రాందాస్, మంగతాయి సూచించారు. మండలంలోని మేచరాజుపల్లి, ఆలేరు, మునిగలవీడు జడ్పీ పాఠశాలల్లో గురువారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించినప్పుడే విద్యార్థులకు అవలీలగా అర్థమై పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తారన్నారు. తరగతి గదుల్లో బోధనోపకరణలతో బోధించాలన్నారు. హెచ్ఎంలు యూడైస్ ప్లస్‌లో స్టూడెంట్స్ ప్రొఫైల్ సమాచారాన్ని అప్‌డేషన్ ప్రక్రియను రేపటికల్లా పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల ఆన్‌లైన్ అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్పీలు టీచింగ్ స్టెప్స్, పీరియడ్, యూనిట్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. మునిగలవీడు జడ్పీ కాంప్లెక్స్ హెచ్ఎం స్వప్న, ఆయా కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## రవీందర్‌నాథ్‌కు డాక్టరేట్



రవీందర్‌నాథ్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్ కవితాదేవి

నెల్లికుదురు, డిసెంబర్ 7 : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన చందపాక రవీందర్‌నాథ్‌కు ఉస్మానియా విశ్వ విద్యాలయం గురువారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రవీందర్‌నాథ్ మాట్లాడుతూ వాణిజ్య విభాగంలో ప్రొఫెసర్ ఎస్ కవితాదేవి పర్యవేక్షణలో మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ గృహాల మధ్య వ్యత్యాసం, ఆర్థిక అక్షరాస్యతపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. రవీందర్‌నాథ్ తల్లిదండ్రులు చందపాక నాగలక్ష్మి–వెంకన్న, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పంట నష్ట పరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

డోర్నకల్, డిసెంబర్ 7 : తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్ కోరారు. గురువారం డోర్నకల్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుఫాన్‌కు నష్టపోయిన వరి, మిర్చి పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో సమగ్ర సర్వే చేయించాలన్నారు. వరి పంట రైతులకు రూ. 50 వేలు, మిర్చి పంట రైతులకు రూ. 2 లక్షలు నష్ట పరిహారం ఇవ్వలని డిమాండ్ చేశారు. అకాల వర్షంలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని కోరారు.

# దెబ్బతిన్న పంటల పరిశీలన



కురవిలో వర్షానికి నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో మంజూఖాన్

కురవి, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి తోటలను మండల వ్యవసాయ అధికారి మంజూఖాన్ గురువారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సింహులపేటలో..**

నర్సింహులపేట : తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను గురువారం తొర్రూరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి రాకేశ్, ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ పరిశీలించారు. మండలంలోని నర్సింహులపేట, రామన్నగూడెం, ముంగిమడుగు, పెద్దనాగారం రెవెన్యూ గ్రామాల్లో మిరుప, పత్తి, వరిని పరిశీలించారు. ధాన్యం తడువకుండా జాగ్రతలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మిర్చిలో వచ్చే పీడల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

డోర్నకల్, డిసెంబర్ 7 : చిల్కోడు మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్ గురువారం తెలిపారు. కాజీపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ ఎస్‌జీఎఫ్ అండర్ –17 విభాగంలో చిల్కోడు మోడల్ స్కూల్ విద్యార్థులు ఆర్ షణ్ముకప్రియ, రిషిత, బీ దీపిక పాల్గొనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 8 నుంచి 10 వరకు జడ్చర్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



రామచంద్రు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

## రామచంద్రు ఆశయాలను నెరవేర్చాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 7: కామ్రేడ్ తండా రామచంద్రు ఆశయాలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముడుపుగల్ గ్రామంలో రామచంద్రు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. వారి సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తండా సందీప్, ఉపేందర్, శ్రీను, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కురవి, డిసెంబర్ 7 : రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు మోద్గులగూడెం జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆర్ ప్రణవి, సీహెచ్ ప్రణతి, టీ నిఖిల్ ఎంపికైనట్లు హెచ్ఎం సత్య నారాయణ చారి గురువారం తెలిపారు. ఈ నెల 09,10న హైదరాబాద్ కొంపల్లిలో జరిగే అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఈటీ కాశీనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎమ్మెల్యే కనకయ్యకు పుష్పగుచ్ఛం అందజేత

బయ్యారం, డిసెంబర్ 7 : ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్యను గురువారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య, పట్టణ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, మూల మధుకర్‌రెడ్డి, ఎం వీరారెడ్డి, బత్తిని రామ్మూర్తి, బానోత్ రాము, ఇంద్రారెడ్డి, రమేశ్, మంగీలాల్, భాస్కర్, సుధాకర్, రాజేందర్, ఉప్పలయ్య, రవి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## విద్యుదాఘాతంతో గేదె మృతి

నర్సింహులపేట, డిసెంబర్ 7 : మండలంలోని నరసింహపురం బంజర గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. బాధిత రైతు బయ్యా వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గాలి వానకు బుధవారం రాత్రి 33/11 కేవీ విద్యుత్ వైరు తెగి కింద పడడంతో పక్కనే ఉన్న గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని రైతు కోరాడు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మాలోతు లక్ష్మి**, భర్త : వెంకటయ్య, వయస్సు : 48 సం||లు, వృత్తి : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 3–23, మంజ్యా తండ, గుర్రప్ప తండ, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించు కున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :**

గ్రామపంచాయితీ గుర్రప్ప తండ, రెవిన్యూ గ్రామము ఎడ్జెర్ల, మండలం, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు మహబూబాబాద్ మరియు జిల్లా రిజిస్ట్రారు వరంగల్, సబ్ రిజిస్ట్రార్ మహబూబాబాద్ వారి పరిధిలో గల రెన్యూ గ్రామము ఎడ్జెర్ల గ్రామపంచాయితీ గుర్రప్ప తండ పరిధిలోని అసెస్మెంట్ నెంబర్ 412 గా గల గ్రామపంచాయితీ డోర్ నెం. 3–23నకు సంబంధించిన ఆర్‌సిసి పై కప్పుగల గృహ నిర్మిత విస్తీర్ణము :320.47 చ||ఫీట్లు, **డాక్యుమెంట్ నెంబర్ : 9856/2023**, ఎసి సీట్‌పై కప్పు గల గృహ నిర్మిత విస్తీర్ణము : 201.93 చ||ఫీట్లు, మరియు గృహముతో యుక్తముగా ఖాళీ స్థల విస్తీర్ణము : 225.04 చ||గ|| లు సమము 188.16 చ||మీ|| గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు** : మాలోతు బలరాం గారి స్థలము, **పడమర** : గ్రామపంచాయితీ రోడ్డు, **ఉత్తరం** : మాలోతు కేస్య గారి గృహము, **దక్షిణము** :మాలోతు భద్రు గారి గృహము.

**జి.హరేందర్ రెడ్డి**

అడ్వకేట్, ఖమ్మం., సెల్ : 9848022542